



విజయనగరం: పశుపతినాథేశ్వర స్వామి ఆలయంలో..

శంభో శంకర

● వైభవంగా శివరాత్రి పూజలు ● భక్తులతో శైవక్షేత్రాలు కిటకిట
● మార్మోగిన శివనామ స్మరణ

శివరాత్రి సందర్భంగా శుక్రవారం జిల్లాలో శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజామునే పవిత్ర స్నానాలు ఆచరించి భక్తులు శివాలయాలకు చేరుకున్నారు. క్యూలైన్లలో నిరీక్షించి శివయ్యను దర్శించుకున్నారు. రుద్రాభిషేకాలు, క్షీర, జలాభిషేకాలు, అర్చనలు, దీపారాధన చేశారు. హరహర మహాదేవ శంభోశంకర, హరోం హర నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. జిల్లాకేంద్రంలోని శివాలయాలతో పాటు ఎస్.కోట పుణ్యగిరిపై వెలసిన ఉమాకోటిలింగేశ్వర, వంగరలోని సంగమేశ్వర, నెల్లిమర్ల మండలంలోని రామతీర్థం రామస్వామి ఆలయాల్లో మహాశివరాత్రి పూజలు వైభవంగా జరిగాయి.



విజయనగరంలో బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శివలింగాలు

విజయనగరం (ఆంధ్రజ్యోతి), మార్చి 8: విజయనగరం శివాలయం వీధిలోని ఉమారామలింగేశ్వర, కోట జంక్షన్‌లోని వీరరాజేశ్వర, కొత్త అగ్రహారంలోని కాశీవిశ్వేశ్వర, రింగురోడ్డులోని పశుపనాథేశ్వర, బాబా మెట్టలోని శివపంచాయతన ఆలయాల్లో శివరాత్రి పూజలు నిర్వహించారు. పశుపతినాథేశ్వర ఆలయం లోని జ్యోతిర్లింగాలకు భక్తులు అభిషేకాలు నిర్వహించారు. కొత్తపేట, పులిగెడ్డవారు వీధి, దాసన్నపేట, ఫూల్‌బాగ్, బాబామెట్ట, డబుల్ కాలనీ, మచ్చకొండ తదితర ప్రాం తాల్లో శివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. ప్రజాపిత బ్రహ్మకుమారి విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో అయోధ్యమైదానంలో నిర్వహించిన త్రిమూర్తి శివజయంతి మహోత్సవాలు కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా సహస్రలింగదర్శనం, అభిషేక లింగం, ద్వాదశి లింగం, మంచులింగం తదితర లింగరూపాలు ఏర్పాటు చేశారు. దీపరాధన కార్యక్రమం ఆకట్టుకుంది.



విజయనగరంలో ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



స్వామి దర్శనంకోసం బారులు తీరిన భక్తులు





జ్ఞాన సరస్వతి ఆలయంలో సామూహిక లింగార్చనలు



పూజలందుకుంటున్న ఉమాకోటిలింగేశ్వర స్వామి

ఎస్.కోట పుణ్యగిరి కొండపై..

శృంగవరపుకోట: పుణ్యగిరి కొండపై వెలసిన ఉమాకోటి లింగేశ్వరస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు తెల్లవారుజామునే కొండపైకి చేరుకున్నారు. అక్కడ పుట్టధార వద్ద స్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులను దృష్టిలో పెట్టుకుని అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. స్నాన ఘట్టాలైన ధారగంగమ్మలోయ, పుట్టధారల వద్ద, క్యూలైన్‌ల వద్ద, మెట్లదారిలో పోలీసులు బందోబస్తు చేపట్టారు.



ఎస్.కోట పుణ్యగిరి పుట్టధార వద్ద స్నానాలు చేస్తున్న భక్తులు

రామతీర్థంలో..

నెల్లిమర్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలో జరిగిన శివరాత్రి జాతరకు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. శుక్రవారం వేకువజామున రామకోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి సీతారాములను, ఉమాసదాశివ స్వామిని దర్శించుకున్నారు. సాయంత్రానికి రామతీర్థం ప్రధాన వీధితో పాటు బోడికొండ పరిసరాలు, కల్యాణ మండపం పరిసరాలు భక్తులతో కిక్కిరిశాయి. బోడికొండపై ఉన్న కోదండరాముని ఆలయాన్ని సందర్శించేందుకు భక్తులు మెట్ల మార్గంలో వెళ్లారు. పూసపాటిరేగ, భోగాపురం, రణస్థలం మండలాలకు చెందిన మత్స్యకారులు రాత్రంతా ఒంటిపై నూనె రాసుకుని మధ్యలో కాగడా పెట్టి నృత్యం చేశారు. భోగాపురం సీఐ బీవీ వెంకటేశ్వరరావు, నెల్లిమర్ల ఎస్ఐ డి.రామగణేష్ పర్యవేక్షణలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆర్టీసీ అధికారులు విజయనగరం, రాజాం, శ్రీకాకుళం నుంచి ప్రత్యేక బస్సులు నడిపారు. జాతర ఏర్పాట్లను ప్రత్యేక అధికారి ఉత్తరాంధ్ర జిల్లాల డిప్యూటీ కమిషనర్ డీఎల్‌వీ రమేష్‌బాబు, దేవస్థానం ఈవో వై.శ్రీనివాసరావు పర్యవేక్షించారు. శుక్రవారం సాయంత్రం బోడి కొండపై ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అఖండ జ్యోతిని వెలిగించారు. రామతీర్థంలోని సీతారాములను, ఉమాసదాశివ స్వామిని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, పద్మావతి దంపతులు, దేవదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ శ్రీరామ సత్యనారాయణ, జిల్లా ఎస్పీ దీపిక, టీడీపీ-జనసేన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి లోకం మాధవి, టీడీపీ నాయకులు కడగల ఆనంద్‌కుమార్, సువ్వాడ రవిశేఖర్, సువ్వాడ వనజాక్షి, తదితరులు దర్శించుకున్నారు.



దేవస్థానం మెట్ల వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

సంగమేశ్వర ఆలయంలో..

వంగర: సంగాంలోని సంగమేశ్వర ఆలయంలో మహాశివరాత్రి పూజలు వైభవంగా జరిగాయి. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం, ఒడిశా నుంచి భక్తులు తరలివచ్చారు. త్రివేణి(నాగావళి, వేగావతి, సువర్ణముఖి) నదులు కలిసే సంగమ ప్రాంతంలో స్నానాలు ఆచరించారు. పితృదేవతలకు పిండ ప్రదానాలు చేశారు. అనంతరం సంగమేశ్వర స్వామిని దర్శించుకున్నారు. భక్తు లకు తాగునీరు, మజ్జిగ పూర్తిస్థాయిలో అందకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. తలనీలాలు సమర్పించేందుకు కేశ ఖండన శాల వద్ద ఇక్కట్లు పడ్డారు.



సంగాంలో బారులు తీరిన భక్తులు




త్రివేణి సంగంలో భక్తుల స్నానాలు



దేవస్థానం వద్ద భక్తుల రద్దీ



కోనేరులో పుణ్యస్నానాలు చేస్తున్న దృశ్యం



వెబ్‌సైట్ ఓపెన్ కావట్లే!

● ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత సీట్లకు దరఖాస్తు చేసుకోవడానికి ఇబ్బందులు
● మరో ఆరు రోజులే గడువు ● విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన

కలెక్టరేట్, మార్చి 8: ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఉచిత సీట్ల కోసం దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం గత నెల 12న నోటిఫికేషన్ ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే ఈ సీట్ల కోసం దరఖాస్తు చేద్దామంటే వెబ్‌సైట్ ఓపెన్ కావడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యా హక్కు చట్టం కింద ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను నిరుపేద, బలహీన,మైనార్టీ వర్గాల కుటుంబాలకు చెందిన పిల్లలకు ప్రభుత్వం కేటాయించింది. అర్హులైన విద్యార్థులు గత నెల 25 నుంచి దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఈనెల 14 లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొంది. అయితే, రోజులు గడుస్తున్నా వెబ్ సైట్ ఓపెన్ కావడం లేదు. దీంతో విద్యార్థులు తల్లిదండ్రులు తీవ్ర నిరాశ చెందుతున్నారు. 25 శాతం సీట్లుల్లో అనాథలు, హెచ్ఐవీ బాధితులు, దివ్యాంగులకు చెందిన పిల్లలకు 5 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బీసీ, మైనార్టీ, ఓసీలకు చెందిన బలహీన వర్గాల పిల్లలకు 6 శాతం సీట్లు కేటాయించారు. దీనికి గ్రామీణ ప్రాంతాలకు చెందిన కుటుంబాలకు ఏడాదికి రూ.1.20లక్షల ఆదాయం, పట్టణ ప్రాంతాల వారికి రూ.1.40 లక్షల వార్షిక ఆదాయం ఉన్నవారే అర్హులు. గతంలో కాకుండా ఈ సారి దరఖాస్తు విధానంలో మార్పు చేశారు. గతంలో విద్యార్థి ఆధార్‌తోపాటు బర్త్ సర్టిఫికెట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేవారు. ఈ సారి అలా కాకుండా విద్యార్థి పాస్‌ఫొటో, ఆధార్, బర్త్ సర్టిఫికెట్, డోమిసిల్, కుల, ఆదాయ ధ్రువపత్రాలు, పేరెంట్స్ ఆధార్ కార్డు, మొబైల్, మెయిల్ ఐడీ ఉండాలి. దరఖాస్తు చేసుకున్న అనంతరం రాష్ట్ర స్థాయిలో లాటరీ ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తారు. అయితే, సీటు కోసం దరఖాస్తు చేసుకోవడానికి వెబ్‌సైట్ లింక్ ఓపెన్ కాకపోవడంతో విద్యార్థులు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి సర్వర్ పని చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమకుమార్ మాట్లాడుతూ.. సర్వర్ సమస్యపై రాష్ట్ర స్థాయి అధికారులతో మాట్లాడుతామని తెలిపారు.

ఎన్నికల విధులపై స్పష్టత ఉండాలి

● ఎటువంటి పొరపాట్లకు తావివ్వొద్దు ● కలెక్టర్ నాగలక్ష్మి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

కలెక్టరేట్, మార్చి 8: ఎన్నికల షెడ్యూలు వచ్చేలోగా ప్రతి అధికారి, సిబ్బందికి తమ విధులపై స్పష్టత ఉండాలని కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. శుక్రవారం సాయంత్రం తన కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. తమకు కేటాయించిన విధులపై అధికారులు, సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలన్నారు. ప్రవర్తన నియమావళిని అవగాహన చేసుకుని, ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సెక్టోరియల్ అధికారుల లభ్యతపై సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించకోవాలని చెప్పారు. 24 గంటలూ పని చేసేలా మూడు ల్యాండ్‌లైన్ ఫోన్ నెంబర్లతో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రిటర్నింగ్ అధికారులు కూడా తమ పరిధిలో ఒక ఫోన్ నెంబరుతో నిరంతరం సేవలు అందించేలా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల కిట్లలో సామగ్రి పూర్తి స్థాయిలో ఉన్నదీ? లేనిది చూసుకోవాలన్నారు. ఎన్నికల సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు అవసరమైన వాహనాలను ముందుగానే అంచనావేసి జిల్లా రవాణా అధికారికి తెలియజేయాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్, వీడియో చిత్రకరణ ఏర్పాట్లు తప్పనసరిగా ఉండాలన్నారు. సెక్టోరియల్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లకు వాహనాలు సమకూరుస్తామన్నారు. వీటికి జీపీఎస్ పరికరాలు అమర్చనున్నట్లు తెలిపారు. ఈ సమమావేశంలో జేసీ కార్తీక్, డీఆర్వో అనిత, ట్రైనీ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్, డీఆర్వో సూర్యకళ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్: కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ దీపికను సన్మానిస్తున్న రెవెన్యూ అధికారులు

ఘనంగా మహిళా దినోత్సవం

విజయనగరం రూరల్/కలెక్టరేట్, మార్చి 8: టీడీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. టీడీపీ విజయనగరం నియోజకవర్గ అభ్యర్థి అదితి గజపతిరాజు, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్వినితో పాటు టీడీపీ మహిళా విభాగం నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మునిసిపల్ మాజీ ఛైర్‌పర్సన్ ప్రసాదుల కనకమహాలక్ష్మి, మత్స్య సంతోషి (క్రీడాకారిణి), కేతా వస్తిరాణి (కండక్టర్), దివ్యదీప్తి (వైద్యురాలు), అచంట మణి (ఉపాధ్యాయురాలు), మన్యాల ఉమారాణి (ఒకేషనల్ ఎడ్యుకేషన్), మజ్జి పైడమ్మ (రాజకీయం), మెహర్ లతా (కర్ణాటక సంగీతం), కొర్నాన రాజ్యలక్ష్మి (రాజకీయ), తదితర రంగాలకు చెందిన మహిళలను సన్మానించారు. అనంతరం టీడీపీ రాష్ట్రశాఖ ప్రకటించిన కొత్త కార్యక్రమం 'కలలకు రెక్కలు' కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ కార్యక్రమం ద్వారా విద్య, వృత్తి, వ్యాపారం, ఉపాధికి సంబంధించి మహిళలకు ఎంతో మేలు జరుగుతుందని అదితి గజపతిరాజు తెలిపారు. ● కలెక్టరేట్‌లో మహిళా దినోత్సవం సందర్భంగా కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ దీపికను రెవెన్యూ అధికారులు సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మహిళలే మహరాణులని తెలిపారు. మగవారితో సమానంగా అన్నిరంగాల్లో రాణించాలని కోరారు. వారితోనే సమాజాభివృద్ధి సాధ్యమని చెప్పారు.



విజయనగరం రూరల్: మహిళలను సన్మానిస్తున్న అదితి గజపతిరాజు, పాలవలస యశస్విని

జామిలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం



వైద్య సేవలు అందిస్తున్న దృశ్యం

జామి: జామి శివాలయం వద్ద శుక్రవారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యాధికారి విజయ్ 79 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందించారు. బీపీ, డయాబెటిస్, చర్మ వ్యాధులు, దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించారు.

రేగిడి మండలంలో..



సంకిలిలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్, సిబ్బంది

రేగిడి: సంకిలి, ఖండ్యాంలోని ఆయుర్వేద డిస్పెన్సరీల ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించారు. సంకిలిలో డాక్టర్ మోహనరావు, ఖండ్యాంలో డాక్టర్ సునీల్ వైద్య సేవలు అందించారు. దాదాపు 200 మందికి మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరాల్లో స్థానిక యోగా టీచర్లు నాగరాజు, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కలెక్టరేట్: రాజాం, గజపతినగరం కస్తూర్బాల్లో ఫిజియోథెరపిస్టులుగా పని చేయడానికి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి, ఎక్స్ -అఫీషియో ఏపీసీ ప్రేమకుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్మీడియట్‌తో పాటు బీపీటీ, ఎంపిటీ అర్హత గల అభ్యర్థులు ఈనెల 9, 10 తేదీల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నిత్యావసరాల పంపిణీ

విజయనగరం రూరల్: కణపాక ఆగురు వీధిలోని మారుతీ స్వయం సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం 100 మంది నిరుపేదలకు 5 కిలోల చొప్పున బియ్యం, ఇతర నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు గుత్తూరు చంద్రశేఖర్, నాగుమల్లి లోకనాథం, గణపతిరావు, ఆడారి వెంకటేశ్వరరావు, చంద్రశేఖరరావు, నాగరాజు, అరసాడ అప్పలస్వామి, తులసీరాం, బుదరాయవలస వెంకటరావు, చెలుమూరి రామ్మోహనరావు పాల్గొన్నారు.



తాగునీటిని పరిశీలిస్తున్న కమిషనర్

కమిషనర్ పర్యటన

రాజాం: పురపాలక సంఘ పరిధిలోని తెలగ వీధి సత్యనారాయణపురం కాలనీలో కమిషనర్ జె.నారా అప్పలనాయుడు సిబ్బందితో కలసి శుక్రవారం పర్యటించారు. కాలనీలో తాగునీటి ఇబ్బందులు, రహదారులు, కాలువల పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేస్తున్నారా లేదా అని అడిగి తెలుచుకున్నారు. తాగునీటి సరఫరా విషయంలో ఇబ్బందులు ఏర్పడితే తన దృష్టికి తీసుకు రావాలని కమిషనర్ సూచించారు. కాలనీలో రహదారుల నిర్మాణానికి అంచనాలు తయారు చేయాలని ఏఈ భాగ్యలక్ష్మిని ఆదేశించారు. వీరితో పాటు కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

రిటైర్డ్ హెచ్ఎం రాములు మృతి



రాములు (ఫైల్)

బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలోని శివాలయం వీధికి చెందిన పొట్టి శ్రీరాములు మున్సిపల్ హైస్కూలు రిటైర్డ్ హెచ్ఎం డోకల రాములు శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతికి తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి బేబీనాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంఘ నేత రౌతు రామ్మూర్తి, సీపీఎం పట్టణ కమిటీ తరఫున పి.శంకరరావు, ఏపీటీఎఫ్ నాయకులు బంకురు జోగినాయుడు, జేసీ రాజు తదితరులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న చోడి ఆదినారాయణ తదితరులు

బీసీ డిక్లరేషన్‌పై హర్షం

విజయనగరం దాసన్నపేట: టీడీపీ ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌పై ప్రజా సంఘాల జేఏసీ హర్షం వ్యక్తం చేసిందని శెట్టి బలిజ యాత సంఘ అధ్యక్షుడు చోడి ఆదినారాయణ అన్నారు. శుక్రవారం కోట సమీపంలోని గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ-జనసేన సంయుక్తంగా బీసీల అభివృద్ధి కోసం అడుగులు వేయడం మంచి పరిణామమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు దిమిలి పైడిరాజు, మరిశర్ల చిట్టితల్లి, కిల్లంపల్లి ఆచారి, బేపల బంగారరాజు, వంగలపూడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జొన్నగుడ్డిలో 'జయహో ఎస్సీ'

విజయనగరం రూరల్: విజయనగరం నియోజకవర్గ పరిధిలోని 27వ డివిజన్ జొన్నగుడ్డిలో టీడీపీ దళిత విభాగం నాయకులు శుక్రవారం 'జయహో ఎస్సీ' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఐదేళ్ల కాలంలో ఈ ప్రభుత్వం అనుసరించిన దళిత వ్యతిరేక విధానాలు, దాడులు, హత్యలు తదితర వాటిని వివరించారు. టీడీపీ హయాంలో దళితుల సంక్షేమానికి చేసిన కృషిని గుర్తు చేశారు. 2024లో టీడీపీ అధికారంలోకి వస్తే, దళిత, గిరిజనుల కోసం చేపట్టనున్న కార్యక్రమాలను వివరించారు. టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు మామిడి రవిశంకర్, కందువా ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

మహిళల కోసం 'కలలకు రెక్కలు'

● టీడీపీ కొత్త పథకం



విజయనగరం: 'కలలకు రెక్కలు' పథకాన్ని ప్రకటిస్తున్న అదితి గజపతిరాజు, పాలవలస యశస్విని, పత్తిగిల్లి సూర్యకుమారి

విజయనగరం రూరల్: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని టీడీపీ రాష్ట్ర శాఖ కొత్త పథకాన్ని ప్రకటించింది. 'కలలకు రెక్కలు' పేరుతో చేపట్టే పథకానికి సంబంధించిన కరపత్రాన్ని నియోజవర్గ అభ్యర్థి అదితి గజపతిరాజు, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్విని శుక్రవారం విడుదల చేశారు. మహిళలకు విద్య, వృత్తి, వ్యాపారం, ఉపాధికి సంబంధించి ఈ పథకం ద్వారా మేలు జరుగుతుందని అదితి చెప్పారు.

మహిళలకు మేలు..

శృంగవరపుకోట: మహిళా సాధికారత కోసం టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు 'కలలకు రెక్కలు' అనే సరికొత్త పథకాన్ని ప్రవేశపెట్టినట్లు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి తెలిపారు. శుక్రవారం స్థానిక అన్న క్యాంటీన్ వద్ద విలేకరులతో మాట్లాడారు. జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌తో కలిసి తీసుకొచ్చిన ఈ పథకం ద్వారా మహిళలకు వృత్తి పరమైన విద్యను అందిస్తారన్నారు. ఇంటర్‌మీడియట్ పూర్తి చేసిన మహిళలు దీని కోసం దరఖాస్తు చేసుకోనేందుకు అర్హులన్నారు. దీని కింద తీసుకునే రుణాలకు రెండు పార్టీలు బాధ్యత వహిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీశెట్టి అరుణ, గన్ను బంగారమ్మ, పొలిమేర కనక మహాలక్ష్మి, బొనంగి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే మహిళల సంక్షేమం..

రాజాం: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు తోనే మహిళా సాధికారికత, సంక్షేమం సాధ్యమని విజయనగరం పార్లమెంటరీ మహిళా అధ్యక్షురాలు మంతిన ఉషారాణి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు లచ్చుభక్త ధనలక్ష్మి అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మహిళా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో వారు మాట్లాడారు. 'కలలకు రెక్కలు' అనే పేరుతో సరికొత్త పథకాన్ని మహిళల కోసం తీసుకు వస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉత్తరావల్లి భవాని, జ్యోతి, పద్మ, అంకమ్మ, తుమ్మి సత్యవతి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

'కలలకు రెక్కలు'తో భరోసా..

బొబ్బిలి: తెలుగుదేశం-జనసేన ప్రభుత్వ హయాంలో వచ్చే జూన్ నుంచి మహిళల కోసం 'కలలకు రెక్కలు' అనే పథకాన్ని ప్రారంభించనున్నట్లు పట్టణ తెలుగు మహిళ అధ్యక్షురాలు కింతలి శ్రీదేవి, పార్లమెంట్ నియోజకవర్గ తెలుగు మహిళ కార్యదర్శి వెలగాడ హైమావతి తెలిపారు. స్థానిక దర్బారు మహల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ పథకం గురించి వివరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా సాధికారత దిశగా టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్‌లు ముందడుగు వేస్తున్నారన్నారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థినులు ఈ పథకంలో దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. పార్టీల పూచీకత్తుతో బ్యాంకు రుణాలు అందించడమే కాక, తీసుకున్న రుణమొత్తానికి వడ్డీని కూటమి ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. ఆర్థిక సమస్యల కారణంగా మహిళలు తమ కలలను సాకారం చేసుకోకుండా ఉండిపోవాల్సిన అవసరం లేదని, ఈ పథకంలో చేరి దేశంలో ఎక్కడైనా వృత్తిపరమైన ఉన్నత విద్యను అభ్యసించవచ్చని తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు రిజిస్ట్రేషన్ లింకు పొందడానికి 92612 92612 నెంబరుకు మిస్డ్ కాల్ ఇవ్వాలని, లేదా నేరుగా 'కలలకు రెక్కలు' అనే వెబ్‌సైట్‌ను పరిశీలించాలని శ్రీదేవి, హైమావతి తెలిపారు. ఈ సమావేశంలో 18వ వార్డు కౌన్సిలరు బొత్స దమయంతి, మాజీ కౌన్సిలరు బీసపు పార్వతి పాల్గొన్నారు.



ఎస్.కోట: కొత్త పథకం గురించి వివరిస్తున్న కోళ్ల లలిత కుమారి



రాజాం: మాట్లాడుతున్న ఉషారాణి, ధనలక్ష్మి తదితరులు



బొబ్బిలి: విలేకరులతో మాట్లాడుతున్న తెలుగు మహిళా నాయకులు



బొబ్బిలిలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

బొబ్బిలిలో పోలీసు కవాతు

బొబ్బిలి: రానున్న ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం బొబ్బిలి పట్టణంలో పోలీసులు కవాతు నిర్వహించారు. సీఐ మలిరెడ్డి నాగేశ్వరరావు, ఏఎస్ఐ బీవీ రమణ ఆధ్వర్యంలో ఆర్‌పీఎఫ్ సిబ్బంది కవాతు నిర్వహించారు. సమస్యాత్మక గ్రామాలలో కట్టుదిట్టమైన ఏర్పాట్ల కోసం చర్యలు తీసుకున్నామని సీఐ తెలిపారు. శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారని చెప్పారు.

అగ్ని ప్రమాదంలో మహిళకు గాయాలు

జామి: రామభద్రపురం గ్రామానికి చెందిన తిలకంశెట్టి సంతోషి గురువారం రాత్రి వంట చేస్తుండగా ప్రమాదవశాత్తూ చీరకు నిప్పంటుకొని గాయాలపాలైంది. ఆమెను రక్షించే ప్రయత్నంలో భర్త గాయపడినట్లు పోలీసులు తెలిపారు. చికిత్స నిమిత్తం విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హెచ్‌సీ ఈశ్వరరావు కేసు నమోదు చేశారు.

సూపరింటెండెంట్‌గా దాసు

రాజాం: స్థానిక ప్రాంతీయ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా కె.గోపాల్‌దాస్‌కు పదోన్నతి లభించింది. ఇంతవరకు ఆయన ఇక్కడ సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేశారు. ఆయనను వైద్యులు, సిబ్బంది అభినందించారు.

మహిళల హక్కుల కోసం పోరాటం

విజయనగరం దాసన్నపేట: మహిళల హక్కుల కోసం పోరాడుతామని జేవీవీ రాష్ట్ర కన్వీనరు నిర్మల అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ మినిస్టీరియల్ భవనంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చాక మహిళల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్లయిందన్నారు. భ్రూణ హత్యలు, లైంగికదాడులు రోజురోజుకీ పెరిగిపోతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కరుణ, చిన్నారి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నిర్మల

ప్రజా తీర్పుతో వైసీపీ ప్రభుత్వం కనుమరుగు

రాజాం: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఇవ్వనున్న తీర్పుతో వైసీపీ ప్రభుత్వం కనుమరుగు కావడం ఖాయమని మాజీ మంత్రి, టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ అన్నారు. శుక్రవారం 9వ వార్డు పరిధిలోని మేదర వీధి, కంచర వీధి, మాధవ బజార్, కుమ్మరి వీధి, గంధి వీధుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కోండ్రు మురళీమోహన్ మాట్లాడుతూ తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు పాలనను రాష్ట్ర ప్రజానీకం కోరుకుంటున్నారని అన్నారు. నియంత వైసీపీ ప్రభుత్వంలో ప్రజలు విసుగెత్తిపోయారన్నారు. చంద్రబాబు రూపకల్పన చేసిన సూపర్‌సిక్స్, బీసీ డిక్లరేషన్‌పై సంతోషం వ్యక్తమవుతోందన్నారు. అనంతరం కుమ్మరి వీధి గ్రామదేవతకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు నంది సూర్యప్రకాష్‌రావు, పొట్నా చిట్టిబాబు, టంకాల కన్నంనాయుడు, శాసపు రమేష్ కుమార్, ఉరిటి సురేంద్ర, తవుడు, బనిశెట్టి వెంకటరావు, తూతిక చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.



గ్రామదేవత పూజల్లో పాల్గొన్న కోండ్రు మురళీమోహన్

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజాం: పొగిరి, బొద్దాం విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా ఆ రెండు సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు, పరిశ్రమలకు ఆదివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏడీ సీహెచ్ మాధవరావు, రూరల్ ఏఈ సురేష్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు, పరిశ్రమల యాజమాన్యాలు సహకరించాలని కోరారు.



బొబ్బిలి: న్యాయాధికారి సరోజనమ్మను సత్కరిస్తున్న దృశ్యం



బొబ్బిలి: క్రీడా పోటీల్లో పాల్గొన్న మహిళలు



జామి: ఫిట్‌నెస్ రన్‌లో విజేతలుగా నిలిచిన విద్యార్థినులు

మగువా.. నీకు వందనం

● ఘనంగా మహిళా దినోత్సవం

మహిళా దినోత్సవాన్ని జిల్లాలో ఘనంగా నిర్వహించారు. విభిన్న రంగాల్లో ఉత్తమ సేవలందించిన మహిళలను వివిధ స్వచ్ఛంద, సేవా సంస్థలు సత్కరించాయి. సమాజంలో మహిళలకు ఉన్న ప్రాముఖ్యతను చాటి చెప్పాయి. కొన్నిచోట్ల మహిళలు కేక్‌లు కట్ చేసి.. ఆటపాటలు.. సాంస్కృతిక కార్యక్రమాలతో సందడిగా గడిపారు.



విజయనగరం: ఎస్పీ దీపికను సత్కరిస్తున్న దృశ్యం

బొండపల్లి: పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లోనూ ముందుంటున్నారని ఎంపీపీ చల్లా చలంనాయుడు అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ కార్యాలయాల్లో ప్రతిభ కనబరుస్తున్న మహిళా ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. ఎంపీడీవో ఎస్.హరిహరరావు, ఏవో డి.వెంకటరమణ, ఏపీవో బి.కృష్ణవేణి, ఏపీఎం కె.సులోచనా దేవి పాల్గొన్నారు.

ఎస్పీ దీపికకు సత్కారం..

విజయనగరం క్రైం: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జనసేన పార్టీ వీరమహిళ మాతా గాయత్రి, అంజనీ పుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు, జనసేన నాయకులు బాలు, పిడుగు సతీష్, మొదిలి శ్రీనివాసరావు, కె.రామకృష్ణలు ఎస్పీ దీపికను శుక్రవారం సత్కరించారు. ఆమె చాంబర్‌లో కలసి శుభాకాంక్షలు తెలిపారు.

బొబ్బిలిలో...

బొబ్బిలి: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జడ్జి సరోజనమ్మను రోటరీ క్లబ్ అధ్యక్షుడు జేసీ రాజు, శ్రీనివాసన్, శంకరరావు తదితరులు సత్కరించారు. విద్యుత్ రెవెన్యూ కార్యాలయ ఉద్యోగి పీపీఏ మెర్సీరాజును ఘనంగా సత్కరించారు. బొబ్బిలి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో యూటీ ఎఫ్ నేత విజయగౌరి ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. మహిళలకు వివిధ పోటీలు నిర్వహించారు.

లక్కవరపుకోటలో...

లక్కవరపుకోట: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మండలంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జమ్మాదేవిపేట వద్ద గల మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ యూవీకే పాత్రో తదితరులు పాల్గొన్నారు. మహిళా ఉద్యోగులను సన్మానించారు.

అన్నమరాజుపేటలో నారీశక్తి..

జామి: జామి మండలం అన్నమరాజుపేటలో శుక్రవారం మహిళా దినోత్సవం సందర్భంగా నారీ శక్తి ఫిట్‌నెస్ రన్ కార్యక్రమం నిర్వహించారు. నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యకర్త బోని మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సత్కారం..

రాజాం: మహిళా దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన మహిళలకు శుక్రవారం మానవత సంస్థ రాజాం శాఖ ఘనంగా సత్కరించింది. కొత్తా చంద్రావతి, లావేటి సులోచన, డాక్టర్ యడ్ల నీరజ, పొట్నా గవర్రాజు, శాసపు జయలక్ష్మీ తదితరులను స్థానిక సన్‌స్కూల్‌లో మానవత చైర్మన్ కొత్తా సాయిప్రశాంత్ కుమార్, ప్రెసిడెంట్ బీబీ అచ్యుత్‌కుమార్, డాక్టర్ పీఎల్ఎన్ రాజు తదితరులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో యు.నీలకంఠేశ్వర యాదవ్, సహాయ కార్యదర్శి పెంకి చైతన్యకుమార్, గట్టి పాపారావు, మక్క అప్పలనాయుడు, పురపాలక సంఘ కమిషనర్ జె. నారాఅప్పలనాయుడు, లావేటి రాజగోపాలనాయుడు, ఆర్‌వీజే నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎస్.కోటలో...

శృంగవరపుకోట: స్థానిక ఆదిలక్ష్మి జ్యూయలరీ యాజమాన్యం నిర్వహించిన మహిళా దినోత్సవంలో శుక్రవారం జెడ్పీటీసీ వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ ఇందుకూరి సుధారాజు, మేజర్ పంచాయితీ సర్పంచ్ గనివాడ సంతోషి కుమారి, ఎంపీటీసీలు మజ్జి దేవి, వాకాడ సింహాచలం, బొడ్డేటి ఆదిలక్ష్మిలు కేక్ కట్ చేశారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌లో మహిళా కండక్టర్‌లకు డిపో అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

టీడీపీ కార్యాలయంలో ..

విజయనగరం రూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శుక్రవారం టీడీపీ కార్యాలయంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విజయనగరం నియోజకవర్గ అభ్యర్థి అదితి గజపతిరాజు, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్విని, టీడీపీ మహిళా విభాగం నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రసాదుల కనకమహాలక్ష్మి, (రాజకీయం), మత్స సంతోషి (క్రీడాకారిణి), కేతా వస్తిరాణి (మహిళా కండక్టర్), దివ్య దీప్తి (వైద్యురాలు), ఆచంట మణి (ఉపాధ్యాయురాలు), మన్యాల ఉమారాణి (ఒకేషనల్ ఎడ్యుకేషన్), మజ్జి పైడమ్మ (రాజకీయం), మెహర్ లత (కర్ణాటక సంగీతం), కొర్నాన రాజ్యలక్ష్మి (రాజకీయ రంగం) తదితరులను ఘనంగా సన్మానించారు.



ఎస్.కోట: కేక్ కట్ చేస్తున్న మహిళా ప్రజాప్రతినిధులు



లక్కవరపుకోట: ఉపాధ్యాయురాలిని సత్కరిస్తున్న దృశ్యం



రాజాం: మహిళలను సత్కరిస్తున్న నాయకులు

కొత్తపాలెంలో కృష్ణమ్మతల్లి మహోత్సవాలు



ఎడ్లబండ్ల పందేలు నిర్వహిస్తున్న దృశ్యం

బొండపల్లి: మండలంలోని కొత్తపాలెంలో మాజీ వైస్ ఎంపీపీ బోద్దురాము, సత్యవతి ఆధ్వర్యంలో కృష్ణమ్మతల్లి మహోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోలాటం, చెక్క భజనలతోపాటు ఆలయ ఆవరణంలో సమారాధన ఏర్పాటుచేశారు. సాయంత్రం జిల్లాస్థాయి ఎడ్లబండ్ల పోటీలతో పాటు గుర్రపు పందేలు, వాలీబాల్, సింగిడిరాళ్ల పోటీలను నిర్వహించారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విజేతలకు పది, ఆరు, నాలుగు, వేల రూపాయలు గజపతినగరం తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కొండపల్లి శ్రీనివాసరావు, లోక్‌సత్తా రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు బీశెట్టి బాబ్జీ, గాదె శ్రీనివాసరావు అందజేశారు. సాయంత్రం ఏర్పాటు చేసిన రేలార జానపద పాటలతో పాటు, సినీ సంగీత విభావరి ఆకట్టుకున్నాయి.

మహిళా సాధికారితకు ఎన్టీఆర్ ప్రాధాన్యం



గజపతినగరం: సూపర్ సిక్స్ పథకాలపై వివరిస్తున్న మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి

గజపతినగరం: టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్‌తోనే మహిళా సాధికారతకు ఎనలేని ప్రాధాన్యం కల్పించారని తెలుగు మహిళా అధ్యక్షురాలు, మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి తెలిపారు. మండలం లోని మరుపల్లిలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా రక్షణ కోసం 2015 లోనే చంద్రబాబు ప్రత్యేక యాప్‌ను రూపొందించారని తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆరోపించారు. మహిళలకు టీడీపీ అధినేత చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలను మహిళలకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ లెంక రామలక్ష్మి పాల్గొన్నారు.

వీధి దీపాలు వెలగక ఇక్కట్లు

బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగకపోవడంతో చీకట్లు అలముకున్నాయి. దీనితో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. 15వ వార్డు గొల్లవీధి జంక్షన్ నుంచి రెండో లైను, సింగారపువీధి, పల్లెవీధి, చిన్నచెరువుగట్టు, కోరాడ వీధులలో వీధి దీపాలు పది రోజులుగా వెలగడం లేదని ఏపీ విద్యార్థి జేపీసీ నాయకుడు సాయి యాదవ్ తెలిపారు. రోడ్డు మీద పశువులు, పందులు, కుక్కలు సంచరిస్తున్నాయని... వీటికి తోడు విషసర్పాలు వస్తుండడంతో బాటసారులు, వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. మున్సిపల్ అధికారులు, నాయకులు స్పందించి వీధి దీపాలను వెలిగించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



గొల్లవీధి జంక్షన్‌లో వీధిదీపం వెలగకపోవడంతో చీకటిగా ఉన్న దృశ్యం

గిరిజనుల హక్కులు కాలరాస్తున్న ప్రభుత్వాలు

బెలగాం: కేంద్రంలో ప్రధాని మోడీ, రాష్ట్రంలో సీఎంజగన్ ప్రభుత్వాలు గిరిజనులకు నష్టంచేసే విధానాలు అవలంబిస్తున్నాయని, గిరిజనుల హక్కులను కాలరాస్తున్నాయని సీపీఎం రాష్ట్ర నాయకుడు ఎం.కృష్ణమూర్తి ఆరోపించారు.గిరిజనుల హక్కులను రక్షించుకోవడానికి ఆదివారం నిర్వహించే ఏజెన్సీ బంద్‌కు పూర్తి మద్దతుఉంటుందని తెలిపారు.ఈనేపథ్యంలో బంద్‌కు మద్దతుగా శుక్రవారం పార్వతీపురం కలెక్టరేట్ వద్ద ఆదివాసీల జన రక్షణ దీక్ష సీపీఎం చేపట్టింది.ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌తో గిరిజన నిరుద్యోగులకు ఉపయోగం లేదని, గిరిజనులకు ప్రత్యేకడీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. 1/70 చట్టం పక్కగా అమలుచేయాలని, అటవీ హక్కుల చట్టం ప్రకారం గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పట్టాలివ్వాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల సంపద ఖనిజాలను కార్పొరేట్లకు దోచుపెడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రెడ్డి వేణు, జి.వెంకటరమణ, ఎం.తిరుపతిరావు, బంటు దాసు, రాము, సూరిబాబు, మన్మథరావు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవం

పార్వతీపురం టౌన్: కాలజ్ఞానబ్రహ్మ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి గోవిందమాంబ అమ్మవార్ల కల్యాణ మహోత్సవం పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జరిగింది. శుక్రవారం పట్టణంలోని ప్రధాన రహదారిలో గల కంగటివారి కూడలివద్ద గల బ్రహ్మంగారి విగ్రహం వద్ద రుత్వికులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నెయ్యిలవీధిలో గల కల్యాణ మండపం వరకు వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ ఉత్సవ విగ్రహాలను మేళతాళాల మధ్య ఊరేగించారు. సాయంత్రం ఆరునుంచి బ్రహ్మేంద్రస్వామి,గోవింద మాంబ అమ్మవార్ల కల్యాణ మహోత్సవం జరిగింది. మధ్యాహ్నం కల్యాణ వేదిక వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పాలకొండలో పోలీసుల కవాతు

పాలకొండ: పట్టణంలో రానున్న సార్వత్రిక ఎన్నికలు దృష్ట్యా పోలీసులు కవాతును శుక్రవారం నిర్వహించారు. పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు, సీఐ చంద్రమౌళి, ఎస్ఐ ప్రశాంత్‌కుమార్, వివిధ దళాల సిబ్బంది కవాతును చేపట్టారు. రానున్న ఎన్నికల్లో ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.● **కురుపాం రూరల్:** రానున్న ఎన్నికల దృష్ట్యా కేంద్ర బలగాలతో మొండెంఖల్‌లోఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ, నీలకంఠాపురం ఎస్ఐ నీలకంఠరావు ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు.

నిరుద్యోగులకు శిక్షణ ప్రారంభం

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం యూత్ శిక్షణకేంద్రంలో ఉపాధి అవకాశాలపై గిరిజన నిరుద్యోగ యువతకు శిక్షణ శుక్రవారం ప్రారంభించారు. వైటీసీ కేంద్రంలోమూడుబ్యాచ్‌లు కోర్సులను ప్రారంభించినట్టు వైటీసీ ఇన్‌చార్జి రాము, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికుమార్ తెలిపారు. ఇక్కడ శిక్షణలు పూర్తిచేసి సర్టిఫికెట్లు మంజూరు చేస్తామని ఐటీడీఏ పథక నిర్వహణ అధికారి విష్ణుచరణ్ తెలిపారు.నిరుద్యోగ గిరిజన యువత కోర్సులను సక్రమంగా పూర్తిచేసి ఉద్యోగాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు రావివలసలో సాయి శతరుద్రమం

గరుగుబిల్లి: మండలంలోని రావివలసలో శనివారం శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో 74వ నమామి సాయి శత రుద్రమం నిర్వహించనున్నట్లు ఆ సమితి జిల్లా అధ్యక్షుడు పల్ల నేతాజీనాయుడు ఒక ప్రకటలో తెలిపారు. కార్యక్రమానికి సత్యసాయి సేవాసంస్థల రాష్ట్ర ప్రతినిధి డాక్టర్ కె.సాయి శ్రీహరి ప్రసాద్‌వర్మ, 120మంది వేద పండితులు హాజరవుతున్నారని పేర్కొన్నారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

సీతంపేట: సీతంపేట గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల (బాలురు), పెద్దమడి గురుకుల పాఠశాలలో (బాలికలు) 2024-25 విద్యా సంవత్సరానికి 5, 6,7,8,9 తరగతుల్లో బ్యాగ్‌లాగ్ సీట్లకు ఆంగ్లమాధ్యమం ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీవో కల్పనాకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు నేరుగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఏపీటీడబ్ల్యూ జీయూఆర్‌యూకే యూ ఎల్‌ఎం.ఎపి.జీవోవీ.ఇన్‌లో సమర్పించాలని పేర్కొన్నారు. ప్రవేశపరీక్షలో మెరిట్‌మార్కులు ఆధారంగా సీట్లు కేటాయించనున్నట్లు తెలిపారు. ఆరు నుంచి తొమ్మిదో తరగతి బ్యాక్‌లాగ్ సీట్లకు గిరిజనులు అర్హులని పేర్కొన్నారు.ఆన్‌లైన్‌లో ఏప్రిల్ పదోతేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

శివోహం

- జిల్లా వ్యాప్తంగా శివరాత్రి వేడుకలు
- శైవక్షేత్రాలకు పోటెత్తిన భక్తులు

జిల్లాలో శివరాత్రి వేడుకలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే శివాలయాలకు భక్తులు పోటెత్తారు. రుద్రాభిషేకాలు, క్షీర, జలాభిషేకాలు, అర్చనలు, దీపారాధన చేశారు. హరహర మహాదేవ శంభోశంకర, హరోం హర నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. భక్తుల రద్దీకి అనుగుణంగా నిర్వాహకులు ఆలయాల్లో ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా జాగరాం నిర్వహించారు.

-ఆంధ్రజ్యోతి బృందం



గజపతినగరం: మరుపల్లి శివాలయంలో భక్తులు



చీపురుపల్లి: పట్టణంలోని ఉమానీలకంఠేశ్వరాలయం వద్ద..



రేగిడి: సంకిలి కాశీవిశ్వేశ్వరాలయంలో..



బొబ్బిలి: దిబ్బవీధి శివాలయంలో పూజలు చేస్తున్న బొబ్బిలి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బేబీనాయన



శృంగవరపుకోట రూరల్: సన్యాసేశ్వరస్వామి ఆలయంలో..





నెల్లిమర్ల:అర్చకుల నుంచి ఆశీర్వాదం అందుకుంటున్న ఎస్పీ దీపిక



బొబ్బిలి: కలువరాయి శ్రీరమణమహర్షి ఆశ్రమంలో పువ్వులతో శివలింగం ఆకారం



రామభద్రపురం: శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



విజయనగరంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



నెల్లిమర్ల:సదాశివుడ్ని దర్శించుకుంటున్న దేవదాయ కమిషనర్ సత్యనారాయణ



విజయనగరం:ఏడు కోవెళ్లల్లో బారులు తీరిన భక్తులు



లక్కవరపుకోట: పూజలు నిర్వహిస్తున్న లలితకుమారి



తెర్లాం: శివాలయానికి పోటెత్తిన భక్తులు

పర్యవేక్షణ లేక.. ఆహ్లాదం కరువు

- పేరుకుపోతున్న వ్యర్థాలు
- ఇదీ రాజాంలో వైఎస్సార్ పార్క్ దుస్థితి



కళావిహీనంగా మారిన పార్క్ మెయిన్‌గేట్



చెరువులో పేరుకుపోయిన వ్యర్థాలు

రాజాం రూరల్: రాజాంలోని వైఎస్సార్ పార్క్ నిర్వహణపై పర్యవేక్షణ లేక పోవడంతో కనీస వసతులు కొరవడ్డాయి. ఇక్క డ సాయంత్రం సేదదీరడానికి వచ్చే వారికి ఆహ్లాదం కరువ వుతోంది.ప్రధానంగా పార్కు ఆనుకుని ఉన్న చెరువులో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. దీంతో ఇక్కడకు వచ్చే సందర్శ కులు అవస్థలకు గురవుతున్నారు.

ఇదీ పరిస్థితి..

రాజాంలో వైఎస్సార్ పార్క్ ఒకప్పుడు ఆహ్లాదకర వాతావరణానికి కేరాఫ్ అడ్రస్‌గా ఉండేది. ఉదయం, సాయంత్రం వచ్చిపోయే వారితో కళకళలాడేది. చెరువు గట్టు చుట్టూ ఉండే సిమెంట్ బాటపై వాకింగ్ చేసేందుకు చాలా మంది వచ్చేవారు. కాసేపు సేద తీరాలనుకునేవారంతా సాయంత్రం అయ్యే సరికి ఇక్కడికి చేరేవారు. మధ్యలో చెరువు, చుట్టూ సిమెంటు రహదారి, కూర్చోవడానికి వీలుగా సిమెంటు బెంచీలు, కొబ్బరి చెట్లు, ఓ వైపు బ్రహ్మంగారి దేవాలయం, ఆలయానికి వెళ్లేవారికి ప్రత్యేకంగా ఓ గేటు, పార్క్‌కు వచ్చేవారికి మరో గేటుతో సకల సౌకర్యాలు ఉండేవి. అయితే ప్రస్తుతం గతానికి భిన్నంగా పరిస్థితి ఉంది.ఉదయం పదిగంటల నుంచి సాయంత్రం పొద్దు పోయే వరకూ ప్రేమ జంటలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. పట్టణంలోని పలు ఇంటర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులు ఉద యం పది గంటల నుంచి ఇక్కడ చేరి ఆహ్లాదకర వాతా వరణాన్ని కలుషితం చేస్తున్నారు. గుంపులు గుంపులుగా ఇక్కడే కాలక్షేపం చేస్తూ ఇతరులకు ఇబ్బంది కలిగేలా వ్యవహరిస్తున్నారు. చీకటిపడితే మందు బాబులతో హడావుడి కూడా ఎక్కువవుతోంది. అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రబిందువుగా మారింది. ఫలితంగా చెరువులో వ్యర్థాలు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. సమీపంలోని కాలనీవాసులు, పార్క్‌ను ఆనుకుని ఉన్న వారు సైతం వ్యర్థాలను చెరువు సమీపంలో వేస్తూ మరింత దుర్గంధం చేస్తున్నారని పలువురు వాపోతున్నారు. ఐదేళ్లపాటు వైసీపీ అధికారంలో ఉన్నా ఈ పార్క్‌ను అభివృద్ధి చేయలేదని జోరుగా విమర్శలొస్తున్నాయి. పార్క్‌లో పారిశుధ్య నిర్వహణ సరిగ్గాలేదని సందర్శకులు చెబుతున్నారు. రెండు గేట్లు ఏర్పాటు చేయగా పర్యవేక్షణ లేకపోవడంతో అర్ధరాత్రి వరకూ మందుబాబులు హల్‌చల్ చేస్తున్నారు. దృష్టిసారిస్తే ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించే అవకాశాలున్నా మున్సిపల్ యంత్రాంగం పట్టించుకో కపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాచ్‌మెన్ నియమించి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని, పోలీసులు సైతం నిఘా వేయాలని స్థానికులు కోరుతున్నారు.

అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు





వంగరలో గ్రావెల్‌ను తరలిస్తున్న ట్రాక్టర్, కింజంగిలో ఇసుక తవ్వకాలు చేపడుతున్న దృశ్యం

వంగర: కింజంగి, వంగర కేంద్రాల నుంచి వారం రోజులుగా కంకర, ఇసుకను ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా తవ్వేస్తున్నారు. అయినా పట్టించుకునే నాథుడే లేరు. పట్టపగలు అధికారుల కళ్లముందే అంతా జరుగుతున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీకి చెందిన ఒక నాయకుడు తన ఏజెంట్లతో ఈ తతంగం నడుపుతుండటంతో అధికారులు ఆ వైపు చూడడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై డీటీ సుందరరావు వద్ద ప్రస్తావించగా... ఇక్కడ గావెల్, ఇసుక తవ్వకాలకు ఎవరికీ అనుమతులు లేవన్నారు. తహసీల్దార్ బదిలీపై వెళ్లారని వెంటనే.. దీనిపై వెంటనే విచారణ చేపట్టాల్సిందిగా తమ సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తానన్నారు.

ఆరోగ్య సిబ్బందిని నియమించాలి

పార్వతీపురం ఆంధ్రజ్యోతి: గిరిజన ఆశ్రమ పాఠశాలలు, కళాశాల వసతిగృహాలకు ప్రత్యేకంగా గతంలో పనిచేసిన ఆదివాసీ ఆరోగ్య సిబ్బందిని నియమించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ ఒక ప్రకటనలో కోరారు. ఇప్పటికే గిరిజనులకు వైద్యసేవలు అందించేందుకు పీహెచ్‌సీలు, సబ్‌సెంటర్ల పరిధిలో నియమితులైన ఏఎన్‌ఎంలను గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విధులు నిర్వహించే విధంగా సర్దుబాటు చేయడం సరైన పద్ధతికాదని తెలిపారు. సర్దుబాటు చేయడం వల్ల గిరిజన ప్రాంతాల్లో అంతంత మాత్రంగానే ఉన్న ప్రభుత్వ వైద్య సేవలు మరింత అధ్వాన్నంగా తయారవుతా యని ఆందోళన వ్యక్తంచేశారు. గిరిజన మోడల్ స్కూల్, ఏపీ గిరిజన, సాంఘిక, వెనుకబడిన, కస్తూర్బా, జ్యోతీరావు పూలే విద్యా సంస్థల మాదిరిగా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాలకు ఏఎన్‌ఎంలను నియమించాలని రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు.

రేపు గురుకుల ప్రవేశపరీక్ష

నెల్లిమర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలల్లో ఐదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు సంబంధించి ఆదివారం పరీక్షలు జరుగుతాయని కళాశాల ప్రిన్సిపాల్ కె.ఉషారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ఐదో తరగతి ప్రవేశ పరీక్ష, మధ్యాహ్నం రెండు నుంచి 4.30 గంటల వరకు ఇంటర్ ప్రవేశ పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. అభ్యర్థులు హాల్ టిక్కెట్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. పరీక్షా కేంద్రానికి గంట ముందుగా చేరుకోవాలని, హాల్ టిక్కెట్‌తో పాటు ఆధార్ జెరాక్స్, బబ్లింగ్ కోసం బాల్ పాయింట్ పెన్ తీసుకురావాలని తెలిపారు.